# సోనియా

- ఆర్. యం. చిదంబరం



ఆరు రోజుల యాంత్రిక జీవితం నుండి బయటపడి, చెవులు చిల్లులు పడేట్టు, గుండె లదిరేటట్టు విరుచుకుపడే ముంబై పట్నపు రొదను, తాత్కాలికంగానైనా మరచిపోదామని, శారద, నేను విహార్ సరోవరం చేరుకున్నాం. అక్కడక్కడా గెడ్డాలు, మీసాలు పెంచుకుని చిత్రకారుల్లా తిరిగే కొందరు మనుషులు. స్వేచ్ఛగా మధురగానం చేస్తూ ఎగిరే పక్షులు, మైలపడక, తియ్యటి గాలి పీలుస్తూ కూనిరాగం తీసే చెట్లు, రంగు రంగుల పువ్వులు. పొగచూరని నిర్మలాకాశం. అలా ప్రకృతి సౌందర్యంలో పులకరిస్తూ వుంటుందనుకున్న మాకు ఆశాభంగమే కలిగింది. అక్కడకూడా యాంత్రిక జీవితపు చేతుల్లో చిక్కుకుని నలిగిపోతున్న మనుష్య ప్రవాహం - భయపడి దాక్కున్న నిశ్శబ్దత - కూల్‌డ్రింక్స్ - ఐస్ క్రీం - బేల్‌పూరి - బయట బస్సుకోసం హనుమంతుడి తోకలా క్యూ-ముంబై వదలి మరోపట్నంలో అడుగుపెట్టినట్టుంది. ఎలాగూ వచ్చాం కదాని, అద్దంలో ఆకాశం ప్రతిబింబం చూసి, గంతేద్దామని, సరస్సు వంక

చూస్తూ నిలబడ్డాం.

కాస్త దూరంలో ఏదో కలకలం – కొందరు అటువైపు ఉత్సాహంగా పరుగెత్తారు. అటువైపు తిరిగి చూశాక, కారణం గ్రహించాను.

ఏదో సినిమా షూటింగు జరుగుతోంది. ఆక్రమించడానికి వస్తున్న సైన్యాన్ని సరిహద్దుల దగ్గర ఆపటానికి సినిమా సిబ్బంది విశ్వప్రయత్నం చేస్తున్నారు. కనీసం ఈ 'తమాషా' అయినా చూద్దామని అక్కడకు చేరుకున్నాం. కెమెరామెన్‌ని ఎక్కడో చూసిన జ్ఞాపకం వచ్చింది. అవునవును. అతను శివరావు – కాలేజీలో నాతోనే చదివాడు. చదువుకని తండ్రి పంపిన డబ్బును, కడుపునిండా తిండి తినక పుస్తకాలు కొనకుండా, ఫిలిం రోల్సు కొని, ముచ్చటగా ఫోటోలు తీసి సద్వినియోగం చేశాడు. అతను ఎందుకూ చెల్లుబడి కాడనుకుంటే ఇలా ప్రయోజకుడైనాడు.

షూటింగు పూర్తి కాగానే విశ్రాంతి తీసుకుంటున్న గదికి వెళ్ళాం.

నన్ను గుర్తు పట్టడానికి శివరావు కొంచెం కష్టపడ్డాడు. సంబరంతో కరచాలనం చేశాడు. కుశల ప్రశ్నలు వేశాడు. శారదను పరిచయం చేద్దామని వెనక్కి తిరిగేసరికి కళ్ళుమూసుకుని వాలు కుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్న హీరోయిన్ వంక తదేక దీక్షతో చూస్తోంది.

ఇద్దరం 'అవునన్నట్టు' ఒకర్నొకరు చూసుకున్నాం.

'శివరావు!.. గీత ఉత్తర ప్రదేశానికి చెందినదా? అనడిగాను.

'అవును.. కానీ నీకెలా తెలుసు?.. పత్రికలో వచ్చిన ఆమె జీవిత చరిత్ర చదివుంటావు.'

'లేదు సుమా!.. అసలు నేను సినిమా పత్రికల వంక కన్నెత్తైనా చూడను. ఆమె రూపురేఖలు చూస్తే అలా అనిపించింది.'

'అయితే అతి సంక్షిప్తంగా చెప్తాను విను.. లక్నోలో మంచి కుటుంబంలో జన్మించింది. బి.ఏ పాసయింది. లలితకళలంటే ప్రాణంకంటే తీపి. తియ్యగా పాడుతుంది.. నాట్యం కూడా నేర్చుకుంది. ఆమె జీవితాశయమంతా సినిమాల్లో నటించడం. అనేక కష్టనష్టాలను ఎదిరించి పోరాడి గమ్యస్థానం చేరుకుంది.'

నేను విరగబడి నవ్వాను. శారద కూడా నిశ్శబ్దంగా నవ్వింది.

శివరావు మా వంక ఆశ్చర్యంగా చూశాడు.

నిద్ర చెడినందు క్కామోలు గీత విసుగ్గా కళ్ళు తెరిచింది.

'మేం జ్ఞాపకం వున్నామా?.. ' అని శారద హిందీలో ప్రశ్నించింది.

గీత చిరునవ్వు నవ్వి లేచి మా దగ్గరకు వచ్చింది.

'మిమ్మల్ని ఎలా మరవగలను?..ఆనాటి రాత్రి ఉదంతం ఇంకా నా కళ్ళెదుట కనిపిస్తూనే వుంది.. మీ అభిమానం, అనురాగం నన్నీ స్థితికి తీసుకువచ్చాయి.'

'అరె!.. మీరింతకు ముందే పరిచితులన్నమాట!.. అనవసరంగా నా చేత వాగించావు.' అన్నాడు శివరావు.

'కాదు.. సుపరిచితులం.. ఒక విధంగా స్నేహితులం కూడా.' అని గీత మళ్ళీ తియ్యగా నవ్వింది. –యోగక్షేమాలు కనుక్కున్నాక.

'మీ చేతనైనంతవరకూ, శక్తి వున్నంత వరకూ పరోపకారం చేస్తున్నారా? నా మాటలు జ్ఞాపకం వున్నాయా?' అనడిగింది.

నేను ఆశ్చర్యపోయాను. ఆమె సిద్ధాంతం ఇంకా మారలేదన్నమాట.

'ప్రస్తుతం ఆ రెండుగదుల ఫ్లాట్‌లోనేనా వుండటం!'

అవునన్నాను.

'పెద్ద ఇల్లు కొనలేక పోయారా?..' అనేది తరువాత ప్రశ్న కావచ్చని జవాబు కోసం సిద్ధమయ్యాను గాని.. గీత టాపిక్ మార్చింది.

కొంతసేపైన తర్వాత ఆమె యూనిట్లో కలిసిపోయింది. గంటసేపు క్యూలో నిలబడ్డాక మా యిద్దరికీ సీట్లు దొరికాయి.

బస్సు ముందుకు పరుగెడుతుంటే ఆలోచనలు వెనక్కి పరుగెత్తాయి.

✦✦✦

నల్లగా, నిగనిగలాడుతూ నిండుగా వున్న నేరేడు పళ్ళకేసి చూసేసరికి నోట్లో లాలాజలం

వూరి చపలత్వం మొదలైంది. చిన్నప్పట్నుంచి అవంటే నాకు చాలా యిష్టం. ఒక్కొక్కప్పుడు క్లాసులు ఎగ్గొట్టి, స్కూలుకు మైలు దూరంలో వున్న తోటలో జొరబడి, చెట్టెక్కి, చీకూ చింతా లేకుండా తృప్తిగా తినేవాణ్ణి. ఆఫీసు వదలి ఇంటికి తిరిగి వస్తుంటే ఆ దుకాణం ఎదురైంది. అది ఓ చిన్నగుడిసె. దాని ముందు ఎత్తుగా ఓ బల్ల. ఓ తట్టలో నేరేడుపళ్ళు. పక్కన చిన్న చిన్న డబ్బాలలో బఠానీలు, వేరుసెనక్కాయలు, బరిఫీలు... ఇంకా ఎన్నో. యజమాని ఓ ముసలాడు. ఉన్న చోటనే కునికి పాట్లు పడుతున్నాడు. తట్టి లేపి ఓ రూపాయి అందించాను. ఒకటికి నాలుగు సార్లు నన్ను పరీక్షగా చూశాడు. చివరికి ఓ ఇరవై పళ్ళు మంచివి, పెద్దవి. ఏరి పొట్లం కట్టిచ్చాడు. నేను ఆశ్చర్యపోయాను. ఓ రూపాయకు ఇన్ని పళ్ళు ఎలా ఇచ్చాడు?.

'నువ్వు ఇల్లు గుల్ల చేయటానికే ఇలా వ్యాపారం చేస్తున్నావు' అని మండిపడింది గుడిసెలో వున్న ఓ అమ్మాయి.

'ఆ ముసల్ది, ఆ కుర్రది – ఇద్దరూ పిసినారి రకం – డబ్బంటే పడి చస్తారు. వాళ్ళుంటే మీకు పట్టుకుని పది పళ్ళు కూడా ఇవ్వరు.' అన్నాడు స్వచ్ఛమైన హిందీలో.

ఆ ముసిల్దానివంక, కుర్రదాని వంక చూశాను. ముసిల్ది కొరకొరమని చూసింది. కుర్రది వెటకారంగానే నవ్వి ఏదో అంది. నాకు సరిగ్గా వినిపించలేదు.

'దాని మాటలకేంలెండి!.. అదలా వాగుతూనే వుంటుంది. వ్యాపారం చేయటంతో సరేనా? బాబూజీ! మనిషికి నీతి–నిజాయితి వుండాలి' అని నవ్వి తిరిగి సుషుప్తిలో మునిగి పోయాడు.

ఆ అమ్మాయికేసి చూశాను..అందమైన గుండ్రటి ముఖం తళుక్కుమనే కళ్ళు – జీవితంలో ఏదో సాధించాలన్న తహ తహ – జడవేసుకుని వారం రోజులై వుంటుంది. మాసిన పరికిణీ – జాకెట్టు – పేరడిగి తెలుసుకోవాలనిపించింది. ముసిలాడు ఈ లోకంలో లేడు. – సరైన పోషణ లేక అవయవాలు సరైన ఆకారం దిద్దుకోలేదు.

'ఈ అమ్మాయిలో ఏదో గొప్పతనం వుంది.. అది ఎప్పుడు బయటపడుతుందో ఏమో! అనుకున్నాను.

ఆ తరువాత నాలుగురోజుల్లో ముసిలాడు మరింత సన్నిహితుడయ్యాడు. అడక్కపోయినా తన కుటుంబ విషయాలు వివరించాడు.

---

# అమ్మ

అమ్మంటే అనురాగం
అమ్మంటే అభిమానం
అమ్మంటే ఆదరణ
అమ్మంటే ఆప్యాయత
అమ్మ వేయించే అడుగు ఆరోహణ
అమ్మ వ్రాయించే అక్షరం ఆధారం
అమ్మ పలుకు అమృతం
అమ్మ పిలుపు అపురూపం
అమ్మ స్పర్శ అద్వితీయం
అమ్మ మనసు అతి మధురం
అమ్మంటే అవని
అమ్మంటే ఆకాశం
అమ్మంటే ఆదికావ్యం
అమ్మంటే అంతులేని ధనం



అమ్మ ప్రేమ అమూల్యం
అమ్మంటేనే ఆశీస్సు!
అమ్మకు అమ్మే సాటి!
అమ్మ లేకుంటే అసలేది సృష్టి?

– సోమంచి ఉషారాణి.

'సోనియాకు పెళ్ళి చేయాలి.. అదే బెంగగా వుంది.' అన్నాడు.

'ఆ చిన్న పిల్లకు అప్పుడే పెళ్ళేవిటి?.' అనడిగాను.

'ఇంకా నయం బాబూజీ!.. మా దేశంలో అయితే ఇంకా చిన్నవయస్సులోనే చేస్తారు. దానికిప్పుడే పదిహేను నిండాయి.' అని ముసిల్డి సమర్ధించింది. నమ్మటం కష్టమన్నట్టు నేను తలాడించాను.

'నిజం బాబూజీ!.. నేనిప్పుడు పదహారులో అడుగుపెట్టాను..చీరకడితే పెద్దమనిషిగా కనిపిస్తాను. పెళ్ళినాడు చూద్దురు కానీ..' అంది సోనియా..

'నోరుముయ్!.. అధిక ప్రసంగం వద్దు. పెళ్ళంటే నీకు వెటకారంగా వున్నట్టుంది. నీకు తగ్గట్టు ఏ తుంటరో వచ్చి తీరుతాడు.' అని మండి పడింది ముసిల్డి.

'రానీ!.. వాడి భరతం పడతాను.'అని ఎదురు సవాలు విసిరింది. అంటే!.. సోనియా పెళ్ళి రోజుకోసం ఎదురు చూస్తోందా ఏవిటి?పదిరోజుల తరువాత-

ముసిలాడు కనిపించలేదు. నన్ను చూడగానే 'రండి బాబూజీ! ఇవాళ నాన్న గుల్ఫీ అమ్మకానికి పోయాడు. ఇంకా తిరిగి రాలేదు. ఒక రూపాయకేనా?.' అనడిగింది. సరిగ్గా పది పళ్ళు దోసిట్లో పోసింది.

'మరీ అన్యాయం చేస్తున్నావు.. మీ నాన్న ఇంతకు రెండు రెట్లిచ్చేవాడు.' అని నిరసన తెలియచేశాను.

'అతనిదేం పోయింది? బీడి కాలుస్తూ కునికిపాట్లు పడతాడు. ఆకలంటూ మరో నాలుగు చపాతీలు తింటాడు. ఒక రూపాయకు ఎవరైనా ఇరవై పళ్ళు ఇస్తారటండి?.. అది సరేకాని బాబూజీ!..మిమ్మల్ని ఓ మాట అడుగుతాను. కోపగించుకోకండి. ఈ రూపాయతోపాటు మరో రూపాయిచ్చే స్తోమత మీకుంది. రెండు రూపాయలు మీకు పెద్ద మొత్తం కాదు. కాని మాకు.. మాబోటి బీదవాళ్ళకు అది బంగారుకాసు. మీరు నష్టపోకుండా చేతనైనంతవరకు మాకు సాయం చేస్తే తప్పేముంది?.. రూపాయకు నేనిచ్చిన నేరేడు పళ్ళు సబబని మీకు తెలుసు. అయినా మీరు దురాశపడుతున్నారు.. అందరూ ఇలా వుండబట్టి మనదేశం ఇలావుంది.'

'ఆగు!. నీ ఉపన్యాసం వినటానికి నేను రాలేదు. నీ పళ్ళు నీ దగ్గర- నా సొమ్ము నా దగ్గర-మరో చోట కొనుక్కోగలను!' అని కోపంగా కదిలాను. సోనియా మరి మాట్లాడలేదు.

నడున్నా సోనియా మాటల్లో వున్న సత్యాసత్యాన్ని గురించి ఆలోచించ సాగాను. ఎక్కువ డబ్బున్నవాళ్ళు, లేనివాళ్ళకు, కొంతవరకు మనస్ఫూర్తిగా సాయంచేస్తే, రెండు తరగతుల వాళ్ళు హాయిగా వుంటారన్నది ఆమె మాటల్లో సారాంశం - అలా అని ధనవంతున్ని దోచుకుని, పేదలకు విందు చేయమనటం లేదు. లేక ధనవంతులు తమ సర్వస్వం దానం చేసి అడవులకు పోవాలనికాదు. ఇచ్చే డబ్బుకు సమానమైన విలువకోసం మాత్రం ఎదురుచూస్తే చాలని ఆమె అభిప్రాయం. ఆలోచించే కొద్దీ ఆ సిద్ధాంతంలో వున్న నిజం స్పష్టంగా కనిపించింది. కాని ఆచరించటం మాత్రం వీలుకాదు. ఎందుకంటే మనిషి మనసునిండా కుళ్ళు-దగా-అసూయ-అత్యాశ-నిండి వున్నాయి. అందులో మంచితనానికి, న్యాయానికి స్థానం వుండదు. సోనియా చదువుకుందా అంటే ఎప్పుడైనా బడికి వెళ్ళిందో లేదో- నాకు తెలియదు కాని ఆమెలో ఏదో ఔన్నత్యం కనపడింది. ఆమెముందు అంత చులకనగా ప్రవర్తించినందుకు సిగ్గుపడ్డాను. ఇంటికి వచ్చాక, శ్రీమతి కిదంతా వివరిస్తే ముఖం చిట్లించి 'సింగనాదం!.. అదేదో వెర్రిగా వాగితే ఆ రోగం మీక్కూడా పట్టినట్టుంది' అని తెంచిపారేసింది.

ఆ మర్నాడు ముసిలాడు కనిపించాడు. నిన్న జరిగిన దానికి క్షమాపణ చెప్పుకున్నాడు. సోనియాకు పెళ్ళి ఖాయమైంది కనక, దాని దుడుకుతనానికి శిక్షించకుండా వదిలేశాడు. అతనిచ్చిన నేరేడు పళ్ళల్లో రెండొంతులు తిరిగిచ్చేశాను.

'అదేవిటి బాబూజీ!.. మామీద కోపమా?..

దాని మాటలు ఖాతరు చేయకండి.. తీసుకోండి!'

'అది కాదు.. నా కెలాంటి కోపమూలేదు. నీ కూతురు మాటలు అక్షరాల నిజం. నేను మనస్ఫూర్తిగానే తిరిగిస్తున్నాను. రేపట్నుంచి రానని భయపడుతున్నావేమో! అలాంటిదేమీ లేదు.' అని నచ్చజెప్పేసరికి తలప్రాణం తోక కొచ్చింది.

ఆ మర్నాడు ఆ గుడిసె ముందు అంతా కోలాహలంగా వుంది. చిన్న పందిరి వేశారు. పెట్రోమాక్సు దీపాలు నాలుగు తగిలించారు. రంగు రంగు కాగితాల తోరణాలు గాలికి రెపరెపలాడుతున్నాయి. ముసిలాడు సిల్కు చొక్కా తొడుక్కున్నాడు. తెల్లటి పంచె కట్టుకున్నాడు. నులక మంచంమీద నలుగురు పెద్ద మనుష్యులు బీడీ కాలుస్తూ గంభీరంగా కనిపించారు. పెళ్ళికొడుకు తరఫున వచ్చిన వాళ్ళు కావొచ్చు.

'ఏవిటి విశేషం?' అనడిగాను.

'బాబూజీ!.. సోనియాకు ఈ రాత్రి పెళ్ళి. మూడురోజులు వ్యాపారం చేయకూడదు' అన్నాడు.

'పెళ్ళికొడుకు ఏవూరి వాడు?.. ఏం చేస్తున్నాడు?.. సోనియాకు నచ్చాడా?'

'బొంబాయిలోనే వుంటున్నాడండి..ఏదో బట్టల మిల్లులో పని.. పెళ్ళికోసం నాలుగొందలు ఖర్చయింది బాబూజీ' అతని ముఖంలో విషాదం కనిపించింది... గుడిసెలో ఓ మూల సోనియా చీర కట్టుకోవటం నేర్చుకుంటోంది. నన్ను గమనించినట్టు లేదు.!

'నెల రోజుల తరువాత ఇద్దరూ వారణాసి వెడతారు. దాని అత్తమామలు చూడాలన్నారట.' ముసిలాడు ఏదో చెప్పుకుపోతున్నాడు. సోనియా మరి కనిపించదంటే ఎందుకో నాకు బాధ కలిగింది.

ఓ వందరూపాయలు ముసిలాడి కిచ్చాను. మొదట్లో వద్దన్నా,చివరకు తీసుకున్నాడు.

ఆ తరువాత సోనియా ఆ గుడిసెలో నాకు కనిపించలేదు.

✦✦✦

రాత్రి పది దాటింది.

బయట వర్షం కుండపోతగా కురుస్తోంది. మెరుపులు, ఉరుములు ప్రకృతిని బీభత్సంగా చిత్రించాయి.

కాలింగ్ బెల్ గణగణమంది.

'ఎవరో కనుక్కున్నాక కాని తలుపు తీయకండి.' అని శారద హెచ్చరించింది. బొంబాయిలో దోపిడీలూ, దొంగతనాలూ ఎలా చిత్రంగా జరుగుతాయో రోజూ పేపరు చదివి తెలుసుకున్న శారద మాటల్లో ఎంతైనా నిజముంది. పదిమంది ఒక్కసారిగా జొరబడి ఉన్నదంతా దోచుకుపోతే ఏం చేయటం?!

'ఎవరది?' అనడిగాను.

'నేనండి బాబూజీ!... సోనియాను. త్వరగా తలుపు తీయండి'

నాకు నమ్మకం కుదరలేదు.

రెండోసారి 'ఎవరు?' అనడిగాను.

'నేనండి! సోనియా!.. నేరేడు పళ్ళు అమ్మే ముసిలాడి కూతుర్ని... కిందటి నెల నాకు పెళ్ళైంది.. దయచేసి తలుపు తీయండి. ఇక్కడ చచ్చిపోతున్నా..!' పూర్తిగా తడిసిముద్దయింది. తలుపు వెంటనే మూసి గొళ్ళెం పెట్టింది. ఇక్ష్వాకుల నాటి చింకి గొడుగు మాత్రం జాలిగా చూసింది.

'ఏమైంది?.. ఈ వర్షంలో రాత్రి ఎక్కడకు బయలుదేరావు?'

'ఉష్!.. గట్టిగా అరవకండి.అలా వంటింట్లోకి పదండి. అంతా చెబుతాను. మౌనంగా ఆమె ననుసరించాను. శారద ముందు గదిలో దీపం ఆర్పేసింది. ఆమె కూడా ఏదో పసికట్టినట్టుంది.

'బాబూజీ!.. ఇప్పుడు నా జీవితం మీ చేతుల్లో ఉంది. మీరు నన్ను కాపాడక తప్పదు.' అంది.

'అసలు ఏం జరిగిందో చెప్పు'

'నాకు పెళ్ళి చేయటంతో అమ్మా నాన్నల బాధ్యత తీరిపోయింది. వాడు అదే, నా మొగుడు–ఓ తాగుబోతు–ఓ దున్నపోతు–తాగి వచ్చి నన్ను చితగ్గొడతాడు. సరదాగా వుంటాడని, సినిమాలకు షికార్లకు తీసుకువెడతాడని ఎంతో సంబరపడ్డాను.. అంతా బూటకం.. తాగటం. ఆపైన బీడీలు కాల్చటం. అంతకు తప్పించి మరేం తెలియదు. తిండికూడా అక్కర్లేదు వాడికి. అలాంటి వాడితో ఎలా వుండగలను? అందుకే పారిపోయి

వచ్చాను.. ఈ వర్షంలో ఎవరూ చూడరనుకున్నా, మరో పట్నానికి పోదామని. కాని నా నసీబు ఇలా వుంది. వాడు ఎదుటపడ్డాడు. ఎక్కడికని నిలదీసి అడిగాడు. ఏదో జవాబిచ్చాను కాని వాడు నమ్మలేదు. ఇక లాభంలేదని వరుగు లంకించుకున్నా. నన్ను తరుముకొస్తున్నాడు. నాకు తెలుసు..'

కాలింగ్ బెల్ మళ్ళీ మోగింది.

'వాడే.. ఆ దరిద్రపు వెధవ - నా పాలిట యముడు'

'ఇపుడేం చేయటం? ముందు దీన్ని బయటకు తరిమేయండి. ఎందుకొచ్చిన పీడ మనకు' అని శారద మండి పడింది.

'మాజీ!.. మీరలా అనకండి. ఈ ఒక్కసారి నన్ను కాపాడండి. మీ మేలు మరువను. మీరు శక్తి కొలదీ కష్టాల్లో ఉన్నవారికి సాయం చేయాలి..' అని బతిమాలింది.

'వాడెవడో గూండా వెధవ - పగబట్టి ఆయన్నేదైనా చేస్తే?..'

'మాజీ!.. అలాంటిదేమీ జరుగదు. వాడి ప్రతాపమంతా ఆడదాని ముందే. మీరు భయపడకండి'

అప్పటికి కాలింగ్ బెల్ మరో రెండుసార్లు మోగింది.

ఎందుకైనా మంచిదని, నా దగ్గరున్న హాకీ స్టిక్ వారగా వుంచి తలుపు తీశాను. పెనుగాలితో పాటు దుర్గంధం కూడా లోనికి జొరబడింది.

పర్వతంలా ఓ మనిషి నిలబడ్డాడు. కోరమీసాలు.. ఎర్రటి తలపాగా పచ్చరంగు గళ్ళ చొక్కా. మాసిన నల్లటి లుంగీ. నోట్లో ఆరిపోయిన బీడీ.

'భగవాన్!..వీడా సోనియా మొగుడు?..' అనుకున్నాను.

'నా పెళ్ళాం ఇక్కడి కొచ్చిందా?...'అనడిగాడు.

'అందరి పెళ్ళాల్ని దాచే ఇల్లనుకున్నావా ఇది?... అర్ధరాత్రి తాగి వచ్చి, నిద్ర పాడు చెయ్యడం చాలక అధిక ప్రసంగంకూడానా? 'అని హుంకరించాను. లోపల గుండెదడ మాత్రం ఎక్కువ కాసాగింది.

'అదంతా తరువాత మాట్లాడుకుందాం. సోనియా ఇక్కడకు రావటం కళ్ళారా చూశాను. మర్యాదగా దాన్ని బయటకు రమ్మను, లేకపోతే అందర్నీ చెట్నీ చేస్తాను.'

'నీ పెళ్ళాం ఇక్కడ లేదు. మరెక్కడకైనా వెళ్ళి వెదుకు. ఆఖరిసారిగా చెప్తున్నా. ఇక్కణ్ణుంచి తక్షణం వెళ్ళిపో. నా యింట్లో టెలిఫోనుంది. ఐదు నిమిషాల్లో పోలీసుల్ని రప్పించగలను. అప్పుడు ఎవరు చెట్నీ అవుతారో చూడొచ్చు.' అని బెదిరించాను. పోలీసులనేసరికి అతనికి భయం వేసినట్టుంది. ఏదో గొణుక్కుంటూ సోనియాను తిట్టుకుంటూ మెట్లు దిగాడు.

ఐదు నిమిషాలు అందరం మౌనంగా వున్నాం.

చలిలో గడగడ వణుకుతున్న సోనియాకు పొడిబట్ట లివ్వాలని, శారదకు అప్పటిక్కాని తోచలేదు.

'బాబూజీ! టెలిఫోను ఎక్కడుంది?.. ముసిలాడికి ఫోన్ చేయాలి' అని ఫక్కున నవ్వింది.

'చాలు చాలు! నీ వేళాకోళమూ నువ్వూనూ. రాత్రి పన్నెండు కావస్తోంది' అని ముఖం చిట్లించింది శారద.

'బాబూజీ!.. ఈ రెండు గదుల్లో ఎలా వుండగలుగుతున్నారు?.. కొంచెం అద్దె ఎక్కువైనా పెద్ద గదులున్న వాటా తీసుకోండి..'

'లక్షలు గుమ్మరించాలి-ఏదైనా బ్యాంకులోంచి దోపిడీ చేసి తీసుకురావాలి.'

'ఆ మూల పడుకుని నిద్రపో. ఈ వానలో ఎక్కడికి పోతావు?.. తెల్లవారనీ. మమ్మల్ని కూడా కాస్త కన్ను మూయనీ?' అని శారద విసుక్కుంది.

'సరే మాజీ!.. మీ మేలు ఎన్నటికీ మరవను.. ఈ వంద రూపాయలు టేబులు మీద పెడుతున్నా. రేపు ఉదయం తీసుకుంటాను. అలా అనుమానంగా చూస్తారెందుకూ?.. ఇది దొంగిలించింది కాదు.. నా మొగుడు తాగటానికి దాచి ఉంచిన డబ్బు..

✦✦✦

మెలకువ వచ్చేసరికి బాగా తెల్లవారింది.

వానకూడా వెలసింది. సోనియా కనిపించలేదు.

'మీ మంచితనం ఏదో ఒకనాడు కొంప కూలుస్తుందని నాకు తెలును. మనకు తెలియకుండా ఉడాయించింది... ఉండండి.. వంటింట్లో వెండి దీపం ఉందో లేదో చూసొస్తాను.'

అని మండిపడింది శారద.

నేను రేడియోస్టాండు వంక చూశాను.

ఎక్కడ వస్తువులక్కడే వున్నాయి. పూచిక పుల్లకూడా మాయం కాలేదు. ఆ వంద రూపాయల నోటు మాత్రం కనిపించలేదు.

'చిత్రమైన సోనియా!.. ఎక్కడకుపోయి ఎలా బతుకుతుందో!' అని వాపోయింది శారద.

నాకు మాత్రం ఆమె భవిష్యత్తు గురించి ఎలాంటి అనుమానాలు లేవు. ఏదో ఒక విధంగా వెలుగులోకి వచ్చి తీరుతుంది. ఆ మర్నాడు ఆఫీసు నుంచి తిరిగి వస్తుంటే బస్‌స్టాండ్‌లో ముసిలాడు ఎదురు పడ్డాడు. ఐస్ బండితో.

'బాగున్నావా?.. సోనియా ఎలావుంది?' అనడిగాను.

'దాని పేరెత్తకండి బాబూజీ!.. అది ఏనాడో చచ్చిపోయింది. సిగ్గులేనిముండ! అది నా కూతురు కాదు. మొగుణ్ణి వదలి ఎక్కడికో పారిపోయింది. మా వంశంలో ఇలాంటి దెప్పుడూ జరగలేదు.'

నా జవాబు కోసం ఎదురు చూడకుండా, బండిని తోసుకుంటూ బరువుగా కదలిపోయాడు.

శారదకూడా నాలాగే ఆలోచనలో మునిగుండాలి. ఇద్దరం ఒకేసారి తేరుకున్నాం.

'సోనియా బి.ఏ. చదివింది.'అన్నాను.

'తియ్యగా పాడుతోంది. నాట్యం కూడా నేర్చుకుంది'. అంది శారద.

'అంతే కాదు. ఆమెకు చిన్నప్పట్నుంచి సినిమాల్లో నటించాలని కొండంత కోరిక' ఇద్దరం విరగబడి నవ్వాం.

తరువాత వారం రోజులకు నాకో రిజిస్టరు ఉత్తరం వచ్చింది. కవరు చించగానే ఓ చెక్కు బయటపడింది. నా పేర రాసిన రెండులక్షల రూపాయల చెక్కు! ఆశ్చర్యపోయాను. ఉత్తరం చదువుకున్నాను.

'బాబూజీ!

చాలా కాలం తరువాత మిమ్మల్ని చూడగలిగాను. నా కెంతో సంతోషంగా వుంది. ఎవరో ఆత్మీయుల్ని చూసినట్టుంది. ఒక్కొక్కప్పుడు మీలా ఎవరూ నన్ను అర్థం చేసుకోలేదనిపిస్తుంది... ఎన్నో అవస్థలు పడి ఎదురు గాలితో పోరాడి ఈ స్థితికి రాగలిగాను. ఆనాడు మీరు కాపాడకపోతే ఈ సంకెళ్ళను తెంచుకుపోవాలన్న నా ధైర్యం దిగజారేది. నా ప్రయత్నంలో ఒకసారి ఓడిపోతే నేను ఏ విధంగా మారేదాన్నో!.. వీలైనప్పుడు మా ఇంటికి రండి. అన్నీ సరదాగా మాట్లాడుకుందాం. గంపెడు నేరేడు పళ్ళు కూడా రెడీగా వుంచుతాను.

ఈ ఉత్తరంతో పాటు మీ పేర రెండు లక్షల రూపాయలకు చెక్కు పంపిస్తున్నా. ఇది మీ ఉపకారానికి ప్రత్యుపకారం కాదు. నా మాటలు జ్ఞాపకం వున్నాయా? మన చేతనైనంతవరకు, నష్టపోకుండా ఇతరులకు సాయం చేయాలన్నాను. మీరు ఆ చిన్న ఫ్లాట్‌లో వుంటూ ఇబ్బంది పడుతున్నారు. ఈ డబ్బుతో చక్కటి ఫ్లాట్ తీసుకోండి. నా సిద్ధాంతాన్ని అమలు పరచడానికిదో అవకాశం. వద్దనకుండా స్వీకరిస్తారు కదూ?.. అన్నట్టు ముసిలాడు నాతోనే వుంటున్నాడు.

నన్ను మర్చిపోకండి.. సోనియా(గీత)'

కళ్ళు చెమ్మగిల్లాయి.

నా వెనక నిలబడి వుత్తరం చదివిన శారద కళ్ళు కూడా నీళ్ళతో నిండాయి.

'వెంటనే బ్రోకరుకు ఫోన్ చేయండి.. మనకో మంచి ఇల్లు కావాలని..' అంది శారద.

'వద్దు..సోనియా.. మన దగ్గర వున్న అనుభూతి కలగాలి. అంటే ఈ చెక్కు మనం జాగ్రత్తగా బీరువాలో వుంచుదాం. ఆమెను మనం మరవకుండా ఉండేందుకు ఇదే గుర్తు.'

మాటలు నాలుక చివర దాకా వచ్చి ఆగిపోయాయి.

శారద నాకు మతి భ్రమ కలిగిందని కంగారు పడి డాక్టర్ని పిలుస్తోంది.

ఏంచేయాలో తెలియక శిలా ప్రతిమలా నిలబడి పోయాను. ❑